

సోమశిలలో 72.537 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 72.537 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 2,750 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, డెల్టాకు 1,550, ఉత్తర కాలువకు 600, కండలేరుకు 1,200, దక్షిణకాలువకు 350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.77,770
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,037
3 శాతం జీఎస్టీతో	రూ.7,248
నవర (8 గ్రా)	రూ.57,984

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.7 /24.5

జిల్లాలో అక్కడక్కడా శనివారం తేమ వాతావరణం ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శుక్రవారం 89 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

మంత్రి క్యాంపు ఆఫీసులో డిష్యుం.. డిష్యుం

- టీడీపీలో రెండు వర్గాల మధ్య ఘర్షణ

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరులోని మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ క్యాంపు కార్యాలయంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. వివరాల్లోకి వెళితే.. నగరంలోని మాల్యాద్రి అనే టీడీపీ నాయకుడికి, అదే ప్రాంతానికి చెందిన మరొక వ్యక్తికి మొదలైన వాదన చినికి చినికి గాలివానైట్లు తీవ్ర గొడవలకు దారి తీసినట్లు తెలుస్తోంది. శుక్రవారం రెండు వర్గాల మధ్య జరుగుతున్న వివాదాన్ని సద్దుమణిచే ప్రయత్నం చేస్తుండగా మంత్రి ఓఎస్‌డీగా ఉన్న వెంకటేశ్వరరావుపై కొందరు టీడీపీ నాయకులు దుర్భాషలాడుతూ దాడిచేసే ప్రయత్నం చేసినట్లు సమాచారం. మా డివిజన్‌లో అనేక సమస్యలు ఇప్పటికీ పరిష్కరించలేదు. కొత్తగా వచ్చిన కొందరు మాపై పెత్తనం చెలాయిస్తున్నారంటూ ఓఎస్‌డీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడినట్లు తెలుస్తోంది. దీంతో మనస్తాపం చెందిన ఆయన కార్యాలయం నుంచి వెళ్లిపోయారు. పార్టీ కోసం కష్టపడిన వారికి ఏమీ చేయకుండా, మధ్యలో వచ్చిన వారికి పెత్తనం ఇచ్చి తమను నిర్లక్ష్యం చేస్తున్నారని మంత్రి తీరుపై టీడీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారు.

విద్య, వసతిదీవెన విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

నెల్లూరు (టౌన్): పెండింగ్‌లో ఉన్న విద్య, వసతి దీవెన పథకాల నిధులను వెంటనే ఇవ్వాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్ షరీఫ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక హరనాథపురం సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యా దీవెన రూ.2,100 కోట్లు, వసతిదీవెన రూ.1,480 కోట్లు పెండింగ్‌లో ఉందన్నారు. జీఓ 77ను రద్దు చేయాలన్నారు. కళాశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని చెబుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్దుల్, తౌసీఫ్, మౌళి, సోహెల్, దాస్ పాల్గొన్నారు.


ప్రాజెక్ట్ కమిటీలకు ఎన్నికలు నేడు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): సాగునీటి సంఘాల ఎన్నికల్లో భాగంగా ప్రాజెక్ట్ కమిటీల ఎన్నిక శనివారం నిర్వహించనున్నారు. జిల్లాలో ఆరు ప్రాజెక్ట్‌లు ఉన్నాయి. సోమశిల, పెన్నార్‌డెల్టా, కనుపూరు కాలువ, గండిపాళెం, రాళ్లపాడు, వీఆర్ కోట ఆనకట్ట సిస్టం ప్రాజెక్ట్‌లకు కమిటీల ఎన్నికలు జరగనున్నాయి. జిల్లాలో ఐదు ప్రాంతాల్లో ఎన్నికల ప్రక్రియ జరగనుంది. ఈ ఎన్నికలకు అవసరమైన అన్ని నిర్వహణ ఏర్పాట్లు పూర్తి చేశామని జలవనరుల శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్, సాగునీటి సంఘాల ఎన్నికల జిల్లా నోడల్ అధికారి దేశ్‌నాయక్ వివరించారు.

ఎన్నికలు జరిగే ప్రదేశాలు

- సోమశిల ప్రాజెక్ట్ ఎన్నిక నెల్లూరు దర్గామిట్టలోని సోమశిల సర్కిల్ కార్యాలయం
- పెన్నార్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఎన్నిక నెల్లూరు రామలింగాపురంలోని ఇరిగేషన్ కార్యాలయం
- కనుపూరు కాలువ ప్రాజెక్ట్ కమిటీ ఎన్నిక నెల్లూరు ఆర్డీఓ కార్యాలయ ఆవరణలోని ఎంపీడీఓ కార్యాలయం
- గండిపాళెం ప్రాజెక్ట్ ఎన్నిక గండిపాళెం
- రాళ్లపాడు, వీఆర్ కోట ఆనకట్ట సిస్టం ప్రాజెక్ట్‌ల కమిటీ ఎన్నికలు కందుకూరు

కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేత



నెల్లూరు(అర్బన్): వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులుగా పనిచేస్తూ మృతి చెందిన వారి కుటుంబ వారసులు ఏడుగురికి శుక్రవారం కారుణ్యనియామక ఉత్తర్వులు కలెక్టరేట్‌లో అందజేశారు. ఆరుగురికి గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగాలు కల్పించారు. కె.శిరీషాకు పంచాయతీరాజ్ ఎస్‌ఈ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగావకాశాన్ని కల్పించారు. ఎస్.జయకృష్ణ, రజనీలకు గ్రేడ్–4 పంచాయతీ కార్యదర్శిగా, పి.సూర్యప్రకాష్‌కు వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌గా, ఏపీఎస్‌కే ప్రణీత్‌కు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా, శ్రీతేజ్, సీహెచ్ హరితకు వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్‌గా పోస్టింగ్ ఇచ్చారు. కలెక్టరేట్ పరిపాలనాధికారి (ఏఓ) తుమ్మా విజయ్‌కుమార్ వీరికి నియామక పత్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కష్టపడి ప్రజలకు మంచి సేవలందించాలని సూచించారు.


విద్యాయజ్ఞం.. భగ్నం

ఈ విద్యా సంవత్సరంలో ట్యాబ్‌ల పంపిణీకి మంగళం

- బైజూస్ బోధన, సీబీఎస్‌ఈ, టోఫెల్ విధానాలకు తిలోదకాలు
- నాడు–నేడుకు పైసా విదల్చని కూటమి ప్రభుత్వం
- పాఠశాలల్లో కంపు కొడుతున్న టాయిలెట్స్
- 6 నెలలుగా ఆయాలు, వాచ్‌మెన్‌లకు అందని జీతాలు
- అమలు కాని తల్లికి వందనం పథకం
- విద్యార్థులకు అరకొరగా విద్యాకానుక
- జనవరి నుంచి అందని విద్య, వసతి దీవెన
- నాణ్యత లేని మధ్యాహ్న భోజనం, కోడిగుడ్లు, చిక్కీలు



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలను అందిపుచ్చుకోవాలనే ఆకాంక్షతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని స్మార్ట్ బోధనకు శ్రీకారం చుట్టారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ పేదింటి విద్యార్థుల కలలను కల్లలు చేసింది. విద్య పరంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లోనే మరో యాభై ఏళ్ల తపస్సు చేసినా.. సాధ్యం కాని ఇంగ్లిష్ మీడియం, బైజూస్ బోధన, సీబీఎస్‌ఈ సిలబస్, హైస్కూల్ ప్లస్‌లు, టోఫెల్ పరీక్ష వంటి విధానాలను అమలు చేసేందుకు గత ప్రభుత్వం యజ్ఞం చేస్తే.. కూటమి పాలకులు భగ్నం చేస్తున్నారు. పాఠశాలలను పూర్తిగా గాలికి వదిలేసింది. విద్యార్థులకు నాణ్యమైన భోజనమే కాదు..పౌష్టికాహారం కొరవడింది.



నేటికీ అందని పాఠ్య, నోటు పుస్తకాలు

విద్యార్థులకు అర్ధ సంవత్సరం పరీక్షలు జరుగుతున్నా.. నేటికీ చాలా పాఠశాలల్లో పూరిస్థాయిలో పాఠ్య, నోటు పుస్తకాలు అందని దయనీయ పరిస్థితి. విద్యార్థులకు అందించిన 9 రకాల వస్తువులు నాణ్యత లేకపోవడంతో అప్పుడే పనికి రాకుండా పోయాయి. నాణ్యతలేని యూనిఫాం, సైజు సరిపోని బూట్లు, నాసిరకం బ్యాగులు విద్యార్థులకు ఇచ్చారు. మధ్యాహ్న భోజనం కూడా నాణ్యత లేదని విద్యార్థులు వాపోతున్నారు. పౌష్టికాహారంగా అందించే కోడిగుడ్లు, చిక్కీలు నాణ్యత లేకపోవడం, గడువు ముగిసిన వాటిని ఇస్తుండడంపై తల్లిదండ్రులు మండి పడుతున్నారు.



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లతో విద్యార్థులు (ఫైల్)



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐఎఫ్‌పీ ద్వారా బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు (ఫైల్)

నెల్లూరు (టౌన్)/నెల్లూరు (బారకాసు): పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తోంది. నాణ్యమైన విద్య, స్మార్ట్ బోధనకు మంగళం పాడే దిశగా అడుగులు వేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. జిల్లాలో 2022–23 విద్యా సంవత్సరంలో 18,513 మంది విద్యార్థులు, 2023–24లో 17,748 ట్యాబ్ లను అందించారు. వీరితో పాటు బోధించే ఉపాధ్యాయులకు సైతం ట్యాబ్‌లను అందజేశారు. ఈ ట్యాబ్‌ల్లో బైజూస్ కంటెంట్‌ను అప్‌లోడ్ చేశారు.

అభివృద్ధి పనులకు మంగళం

ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులకు కూటమి ప్రభుత్వం తిలోదకాలిచ్చింది. జిల్లాలో తొలి విడతలో 1,059 పాఠశాలలను రూ.231.60 కోట్లతో అభివృద్ధి చేసింది. రెండో విడతలో 1,356 పాఠశాలలు, అంగన్‌వాడీలు, బీఈడీ, డైట్ కళాశాలల్లో రూ.466.94 కోట్లతో అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా రూ.190.45 కోట్ల నిధులు విడుదల చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు దాటినా.. నాడు–నేడు పనులకు ఒక్క పైసా కూడా నిధులు విడుదల చేయకపోవడం గమనార్హం. పాఠశాలల నిర్వహణను గాలికి వదిలేసింది. పాఠశాలల టాయిలెట్స్ కంపుకొడుతున్నాయి. శుభ్రతకు వినియోగించే రసాయనాలు, చీపుర్లు తదితర వాటికి నిధులు విడుదల చేయలేదు. అక్కడ పనిచేసే ఆయాలు, వాచ్‌మెన్లకు గత 6 నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో వారు కూడా మొక్కుబడిగా పనిచేస్తున్నారు. దీంతో పాఠశాలల మరుగుదొడ్లు దుర్గంధం వెదజల్లుతున్నాయి. తాగునీరు అందించే ఆర్వో ప్లాంట్లు సైతం మరమ్మతులకు గురైతే బాటిని బాగు చేయించే దానికి నిధులు లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉంది.

విద్యా, వసతి దీవెనలూ అంతే..

డిగ్రీ, ఇంజినీరింగ్ చదివే విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన కింద ఎంత ఫీజు ఉంటే అంత ఫీజును రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించింది. వసతి దీవెన కింద ఏటా రూ.20 వేలు అందజేసింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఒక్క పైసా కూడా విడుదల చేయలేదు. దీంతో ఆయా యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కొన్ని కళాశాలల్లో విద్యార్థులను పరీక్షలు రాయకుండా నిలిపివేయడం, మరికొన్ని కళాశాలల్లో సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారు. గత ప్రభుత్వం విదేశాలకు వెళ్లే విద్యార్థులకు జగనన్న విదేశీ విద్యాదీవెన కింద రూ.కోటి అందజేశారు. ఈ ప్రభుత్వం అంబేడ్కర్ ఓవర్సీస్ విద్య పేరు మార్చి ఇప్పటి వరకు ఒక్కరికీ కూడా ఖర్చు చేయని పరిస్థితి ఉంది.

పథకాలకు తిలోధకాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇంటిలో ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం పేరుతో రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. గత విద్యా సంవత్సరానికి సంబంధించి ఇవ్వాల్సిన తల్లికి వందనం పథకం ఊసే ఎత్తడంలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏటా జూన్‌లో అమ్మఒడి కింద తల్లుల బ్యాంక్ అకౌంట్‌ల్లో రూ.15 వేలు వంతున జమ చేసింది.

విద్యాసంవత్సరం	విద్యార్థులు	మొత్తం ఉమ్మడి జిల్లాలో..
2019-20	2,51,811 మంది	రూ.377,71,65,000,
2020-21	4,07,272 మంది	రూ.610,90,80.000
విభజన జిల్లాలో..		
2021-22	2,31,866 మంది	రూ.347,79,90,000
2022-23	2,26,205 మంది	రూ. 339,30,75,00
2023-24	4,10,779 మంది	(కూటమి ప్రభుత్వం పెండింగ్)

గత ప్రభుత్వ హయాంలో ఖర్చు చేసింది	ఇప్పుడు
నాడు–నేడుకు రూ. 698.54 కోట్లు	ఒక్క పైసా విడుదల చేయలేదు
అమ్మఒడి 4 ఏళ్లు అందజేత	ఈ విద్యా సంవత్సరం ఇవ్వలేదు
ట్యాబ్‌లు గత రెండేళ్లు ఇచ్చారు	ఈ విద్యా సంవత్సరం ఇవ్వలేదు
స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీలు పంపిణీ	ఒక్కటీ కూడా ఇవ్వలేదు
విద్యాదీవెన వసతి దీవెన (ఐదేళ్లు అమలు)	పైసా కూడా విడుదల చేయలేదు
టాయిలెట్స్ శుభ్రతకు నిధులు ఆయాలు, వాచ్‌మెన్‌లకు జీతాలు	ఆయాలు, వాచ్‌మెన్‌లకు జీతాలు ఇవ్వలేదు. ఫినాయిల్, బ్లీచింగ్‌కు కూడా డబ్బులు లేవు
ఇంగ్లిష్ మీడియం, బైజూస్, సీబీఎస్‌ఈ, టోఫెల్, హైస్కూల్ ప్లస్‌లు ఏర్పాటు	ఎత్తి వేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు, ఈ విద్యా సంవత్సరంలో బైజూస్ విద్య ఎత్తివేత

ప్రపంచ స్థాయి విద్యా బోధనకు..

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలను దరి చేర్చేందుకు గత ప్రభుత్వం 1వ తరగతి నుంచే ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్‌ఈ సిలబస్, హైస్కూల్ ప్లస్‌లు, టోఫెల్ పరీక్ష విధానాన్ని అమల్లోకి తెచ్చింది. విద్యార్థి తరగతిలో విన్న తర్వాత ఇంటికి వెళ్లి మరొకసారి చదువుకునే విధంగా ఈ ట్యాబ్‌ల ద్వారా అవకాశం కల్పించారు. ఇక పాఠశాలలో కూడా స్మార్ట్ బోధనకు అనుగుణంగా జిల్లాలో తొలి విడతలో 1,324 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్, 428 స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేశారు. రెండో విడతలో 1 నుంచి 5వ తరగతి వరకు స్మార్ట్ టీవీలు, 6 నుంచి 10వ తరగతి వరకు ఐఎఫ్‌పీ ద్వారా విద్యాబోధకు శ్రీకారం చుట్టారు. జిల్లాలోని 41 పాఠశాలల్లో సీబీఎస్‌ఈ సిలబస్‌ను అమలు చేశారు. టోఫెల్ పరీక్ష విధానంపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు పూర్తిగా ఇంగ్లిష్ మీడియంలో బోధించి, పరీక్షలు నిర్వహించే విధంగా తీర్చిదిద్దారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఈ తరహా స్థాయి విద్యా ప్రమాణాలు అందుబాటులోకి రావాలంటే.. విద్య పరంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లోనే మరో యాభై ఏళ్లు పడుతోంది.

విద్యావ్యవస్థ నిర్వీర్యం

కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది. అమ్మకు వందనం ఇవ్వకుండా మోసం చేసింది. విద్యా, వసతి దీవెన నిధుల ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలల్లో పనిచేసే ఆయాలు, వాచ్‌మెన్లకు వెంటనే జీతాలు ఇవ్వాలి. నాడు–నేడు పనులను నిలిపివేసింది.

– కేవీ నారాయణరాజు, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌టీఎఫ్

అమ్మఒడి గొప్ప పథకం



చదువుకునేందుకు ఆర్థిక సమస్యతో ఏ తల్లి ఇబ్బంది పడకూడదని 'అమ్మ ఒడి' పథకం ద్వారా ఏటా రూ.15 వేలు నగదును గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి ఖాతాలో జమ చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో తల్లికి వందనం పేరుతో ఏదో మేలు చేస్తారని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసే ఎత్తడం లేదు.

– ధనూజ, నజీర్‌తోట, నెల్లూరు

అబద్ధాలతో మోసం



పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలపై ప్రభుత్వం తీరు మారాలి. అబద్ధాలతో ఎంత కాలం మోసం చేయలేరు. విద్యార్థులకు సదుపాయాల కల్పనలో అలసత్వం ప్రదర్శించడం సరికాదు. ఇప్పటి వరకు తల్లికి వందనం ఇవ్వలేదు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు ద్వారా మౌలిక వసతులు కల్పించి, కార్పొరేట్ స్కూల్స్‌కు సమానంగా ఎంతో అభివృద్ధి చేశారు.

– సానా కుమారి, శ్రీనివాసనగర్, నెల్లూరు

గతంలో నాణ్యతతో కూడిన చదువులు



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు నాణ్యతా ప్రమాణాలతో కూడిన చదువులు అభ్యసిస్తున్నారంటే అందుకు కారణం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న చర్యలే. ఇంగ్లిష్ బోధన, బైజూస్ వంటివి అందుబాటులోకి తెచ్చారు. వీటితో పాటు అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలను సైతం కూటమి ప్రభుత్వం అందించడంలేదు.

– నిజాముద్దీన్, శాంతినగర్, నెల్లూరు

పార్టీని మరింత బలోపేతం చేస్తాం



పార్టీ జిల్లా నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, కాకాణి, రామ్‌కుమార్‌రెడ్డి, కిలివేటి, విజయకుమార్‌రెడ్డి తదితరులు



వైఎస్సార్ విగ్రహావిష్కరణలో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు తదితరులు

- మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- పార్టీ జిల్లా నూతన కార్యాలయం ప్రారంభం
- జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకుల హాజరు

నెల్లూరు (బారకాసు): వైఎస్సార్‌సీపీని జిల్లాలో క్షేత్ర స్థాయి నుంచి మరింత బలోపేతం చేస్తామని మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. నగరంలోని డైకస్‌రోడ్డు సమీపంలోని సాయిరాంనగర్‌లో నూతనంగా నిర్మించిన పార్టీ జిల్లా కార్యాలయాన్ని మాజీ మంత్రులు జెడ్పీ చైర్మన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, నాయకులు, కార్యకర్తలతో కలిసి శుక్రవారం అట్టహాసంగా ప్రారంభించారు. తొలుత కార్యాలయ ఆవరణలో పార్టీ జెండాను ఎగుర వేశారు. తర్వాత ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జ్యోతి ప్రజ్వలన చేసి పలు విభాగాల గదులను ప్రారంభించారు. అనంతరం మీడియా సమావేశంలో కాకాణి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల్లో భాగంగా విద్యుత్ చార్జీల పెంపుపై ఈ నెల 27న ధర్నా నిర్వహిస్తామన్నారు. ప్రజలకు అండగా నిలిచి, వారిపై అదనపు భారం పడకుండా చూడాలనే లక్ష్యంతో పనిచేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన పార్టీ అనుబంధ విభాగాలకు సంబంధించిన జిల్లా అధ్యక్షుల పేర్లను కాకాణి వెల్లడించారు. మాజీ మంత్రి డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, ఎమ్మెల్సీ, నెల్లూరు సిటీ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి, వెంకటగిరి ఇన్‌చార్జి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పార్టీ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి ఖలీల్ అహ్మద్, డీసీసీబీ మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వీరిచలపతి, పార్టీ నాయకులు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, నాయకులు సయ్యద్ హంజాహుస్సేన్, చిల్లకూరు సుధీర్‌రెడ్డి, నిరంజన్ బాబురెడ్డితోపాటు పలువురు మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

రూ.10 కోట్ల భూమి.. హాంఫట్

- గణేశ్వరపురంలో రెచ్చిపోతున్న ఆక్రమణదారులు
- తాజాగా మరో 70 ఎకరాల మేత పోరంబోకు కబ్జాకు సిద్ధం
- చెట్లు తొలగించి ట్రాక్టర్‌తో దుక్కి
- ముఖం చాటేసిన రెవెన్యూ అధికారులు
- సబ్ కలెక్టర్‌కు పలువురి ఫిర్యాదు



ఆక్రమించి సాగు చేస్తున్న మేతపోరంబోకు భూమి


ఉదయగిరి: ప్రభుత్వ మేత పోరంబోకు భూమికి కూటమి నేతలు ఎసరు పెడుతున్నారు. వరికుంటపాడు మండలం గణేశ్వరపురంలో సుమారు రూ.10 కోట్లు విలువ చేసే దాదాపు 80 ఎకరాల భూమి ఇంతకు ముందే ఆక్రమణకు గురి కాగా, తాజాగా మరో 70 ఎకరాల కబ్జా పర్వాన్ని సాగిస్తున్నారు. గ్రామ సర్వే నంబరు 169లో 277.95 ఎకరాలు, 196లో 177.34 ఎకరాల మేతపోరంబోకు భూమి ఉంది. ఈ భూమి కొన్నేళ్లుగా ఆక్రమణకు గురవుతోంది. ఇప్పటికే భూముల ఆక్రమణలపై గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. తాజాగా మరో 70 ఎకరాలు స్వాహా చేసేందుకు మూడు రోజుల నుంచి చెట్లు తొలగించి ట్రాక్టర్ ద్వారా దుక్కి చేస్తున్నారు. ఈ విషయం వీఆర్వోకు తెలిపినా, ఆక్రమణదారులను ఆపలేదని గ్రామస్తులు చెబుతున్నారు.

ఆందోళనలో పశుపోషకులు

గ్రామంలోని సుమారు 200 కుటుంబాలు కేవలం పశువులు పోషణ, మేకలు, గొర్రెలు పెంపకం ద్వారా జీవనం సాగిస్తుంటారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలు జీవాల పోషణ ద్వారానే జీవనం సాగిస్తున్నారు. ఇతరులు పశువులతో కుటుంబాలను పోషించికుంటున్నారు. జిల్లాలోనే అత్యధిక పాలు ఉత్పత్తి చేసే గ్రామాల్లో ఈ గ్రామం ముందు వరుసలో ఉంటుంది. మేత పోరంబోకు కబ్జా చేసి ఆక్రమణ చేస్తే పశువులు, జీవాలు మేపుకునే అవకాశం ఉండదు. దీంతో అనేక కుటుంబాలు జీవనాధారం కోల్పోయి వీధిన పడే పరిస్థితి ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేరు చెప్పుకుంటూ మేత పోరంబోకు ఆక్రమణ చేస్తున్నారని, ఈ భూములు ఆక్రమణకు గురైతే జీవనాధారం పోతుందని అధికార పార్టీకే చెందిన కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆక్రమిత భూములను పరిశీలించిన సబ్ కలెక్టర్


గ్రామంలో ఆక్రమణకు గురైన పశువుల మేత పోరంబోకు భూమిని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ శుక్రవారం పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. ఆక్రమణకు గురైన భూములు వివరాలు సర్వేయర్, తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. భూములు ఆక్రమించిన వారికి నోటీసులు ఇచ్చి అందులో నుంచి తొలగించాలని ఆదేశాలు ఇచ్చారు. ఎవరైనా ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

పక్షుల సందడి

ఆకాశానికి హారం : చెరువుపై తిరుగుతున్న పక్షులు



నెల్లూరులోని స్వర్ణాల చెరువు జలకళ సంతరించుకుంది. ఈ నేపథ్యంలో అక్కడ వివిధ రకాల పక్షులు సందడి చేస్తున్నాయి. కొన్ని ఆహార వేటలో నిమగ్నం కాగా.. మరికొన్ని ఆకాశంలో తిరుగుతున్నాయి. ఈ దృశ్యాలు సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



ఆహార వేటలో కొంగ



నీటిలో చేపల్ని వెతుకుతూ..



దొరికేసినట్టుంది..



చేప చిక్కింది..

తలకు భారం కాదు.. భద్రత

ద్విచక్ర వాహనదారులు కొందరు నిర్లక్ష్యానికి కేరాఫ్‌గా ఉంటున్నారు. హెల్మెట్ ధరించాలని పోలీసులు ఎన్నిసార్లు చెప్పినా చెవికెక్కించుకోవడం లేదు. తెలిసి తెలిసి ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. ఇటీవల జిల్లాలో జరిగిన కొన్ని రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ లేక కొందరు ప్రాణాలు విడిచారు. చిన్నపాటి నిర్లక్ష్యం కుటుంబాలను రోడ్డున పడేస్తోందని, జాగ్రత్తగా ఉండాలని పోలీస్ అధికారులు సూచిస్తున్నారు.

- చిన్న నిర్లక్ష్యం ఖరీదు నిండు ప్రాణం
- హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులు
- 20 రోజుల వ్యవధిలో పదిమంది మృతి
- అశ్రద్ధ వద్దంటున్న పోలీసులు



నెల్లూరులో హెల్మెట్ ధరించకుండా ప్రమాదకర ప్రయాణం సాగిస్తున్న యువకులు



పోలీస్ శాఖ విడుదల చేసిన పోస్టర్

నెల్లూరు(క్రైమ్): ప్రమాదాలు అనుకోకుండా జరుగుతుంటాయి. ఎప్పుడు ఏం జరుగుతుందో మన చేతుల్లో ఉండదు. అయితే జాగ్రత్తలను విధిగా పాటించడం ద్వారా ప్రమాదాల బారిన పడినా సురక్షితంగా బయటపడొచ్చు. అధికశాతం రోడ్డు ప్రమాదాల్లో తలకు బలమైన గాయాలై మృత్యువాత పడేవారు ఎందరో ఉన్నారు. హెల్మెట్ ధరిస్తే ప్రాణాపాయం తప్పుతుందని తెలిసినా ద్విచక్ర వాహనదారులు కొందరు పట్టించుకోవడం లేదు. జిల్లాలో 20 రోజుల వ్యవధిలో పదిమందికి పైగా ద్విచక్ర వాహనచోదకులు రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయాలై మృతిచెందారు.

తప్పనిసరి..

మోటార్‌బైక్ నడిపేవారితోపాటు వెనుక కూర్చొన్న వ్యక్తులు సైతం తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఆ ఆదేశాలను పక్కాగా అమలు చేసేందుకు పోలీసు యంత్రాంగం నడుం బిగించింది. సోషల్ మీడియా వేదికగా హెల్మెట్ వినియోగంపై విస్తృత అవగాహన కల్పిస్తోంది. మరోవైపు వాహన తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనల ఉల్లంఘనులపై చర్యలు తీసుకుంటున్నారు.

కొన్ని ఘటనలు..

- నెల్లూరు ఎన్టీఆర్ నగర్ సమీపంలో జాతీయ రహదారిపై మోటార్‌బైక్‌పై వెళ్తున్న రామకృష్ణ అనే వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు.
- నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వద్ద బైక్‌పై రోడ్డు దాటుతున్న వ్యక్తిని మరో బైక్ వేగంగా ఢీకొనడంతో చనిపోయాడు.
- రామన్నపాళెం గేటు వద్ద స్కూటీ అదుపు తప్పడంతో కృష్ణకిశోర్ అనే వ్యక్తికి తలకు గాయమై అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు.
- నార్త్‌ఆమలూరుకు చెందిన భరత్ పని నిమిత్తం బైక్‌పై వెళుతూ ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌ను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.
- నెల్లూరు రూరల్ మండల పరిధిలోని గుడిపల్లిపాడుకు చెందిన జగదీష్ బైక్‌పై నెల్లూరుకు వస్తూ గేదె అడ్డురావడంతో తప్పించబోయి కిందపడ్డాడు. తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు.



నెల్లూరులో ఘటనా స్థలంలో మృతదేహం (ఫైల్)

పోలీసుల సూచన

చాలామంది యువకులు హెల్మెట్ ధరించకుండా వేగంగా ఇష్టానుసారంగా తిరిగేస్తున్నారు. వీరే ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. గత 20 రోజుల వ్యవధిలో జిల్లా వ్యాప్తంగా పోలీసుల తనిఖీల్లో 350 మందికి పైగా హెల్మెట్ ధరించని వారికి జరిమానా విధించి ఉంటారని అంచనా. ద్విచక్ర వాహనచోదక సమయంలో విధిగా హెల్మెట్ ధరించాలి. డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మితిమీరిన వేగం, పరిమితికి మించిన ప్రయాణం, ఎదుటి వాహనచోదకులను గమనించకపోవడం వంటి అంశాలూ ప్రమాదాలకు కారణమవుతున్నాయన్న విషయాలను గమనించాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

వాటినే వినియోగించాలి

ప్రజల అవసరాల రీత్యా బైక్‌ల వినియోగం పెరిగింది. ప్రజలు అధునాతన హంగులతో కూడిన వాటిని రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. అయితే జీవితానికి అత్యంత భద్రత కల్పించే హెల్మెట్ విషయంలో మాత్రం అశ్రద్ధ చూపుతున్నారు. ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు ఎక్కడ దెబ్బలు తగిలినా దాదాపుగా ప్రాణాలకు ముప్పు ఉండకపోవచ్చు. కానీ తలకు తగిలితే మాత్రం క్షణాల్లో ప్రాణం పోయే అవకాశం ఉంది. కొందరు రహదారుల వెంట దొరికే నాసిరకం హెల్మెట్లను కొనుగోలు చేస్తున్నారు. అవి ప్రమాద సమయంలో వాహనచోదకులు రక్షించవని పరిశీలనల్లో తేలింది. నాణ్యమైనవే వాడాలి. బీఐఎస్ స్టాండర్స్ ప్రకారం తయారు చేసిన హెల్మెట్లలో సాగేతత్వం కలిగిన పాలిస్టర్ వినియోగించడం వల్ల ప్రమాదం జరిగినప్పుడు తలకు దెబ్బతగలకుండా కాపాడుతుంది. ప్రమాద తీవ్రతను తగ్గిస్తుంది.

శుభకార్యానికి వెళ్లొస్తూ.. కానరాని లోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి
- భర్త కళ్లెదుటే ఘటన

నెల్లూరు(క్రైమ్): దంపతులిద్దరూ మనుమరాలి శుభకార్యంలో పాల్గొని మోటార్‌బైక్‌పై ఇంటికి బయలుదేరారు. కొద్దిసేపట్లో ఇంటికి చేరుకుంటారనగా గుర్తుతెలియని వాహనం ఢీకొని వివాహిత మృతిచెందింది. కళ్లెదుటే భార్య చనిపోవడాన్ని చూసిన భర్త కన్నీరుమున్నీరుగా రోదించాడు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు భగత్‌సింగ్ కాలనీకి చెందిన షేక్ జైనుల్లా, మస్తానమ్మ (60) దంపతులకు కొడుకు, కుమార్తె సంతానం. ప్రస్తుతం వారు ఉపాధి నిమిత్తం సౌదీలో ఉంటున్నారు. జైనుల్లా, మస్తానమ్మలు ఇంటి వద్ద చిల్లర దుకాణం నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి దంపతులిద్దరూ వెంకటాచలం మండలం గురివిందపూడి గ్రామంలో జరిగిన మనుమరాలి శ్రీమంతం వేడుకల్లో పాల్గొన్నారు. బంధువులతో ఆనందంగా గడిపారు. అర్ధరాత్రి బైక్‌పై జాతీయ రహదారి మీదుగా భగత్ సింగ్‌కాలనీకి బయలుదేరారు. ఎన్టీఆర్ నగర్ సమీపంలోకి మితిమీరిన వేగంతో గుర్తుతెలియని వాహనం వారి బైక్‌ను వెనుక నుంచి ఢీకొంది. దీంతో దంపతులు రోడ్డుపై పడ్డారు. డ్రైవర్ పరారయ్యే క్రమంలో మస్తానమ్మ మీదకు వాహనాన్ని ఎక్కించాడు. ఆమె తలపగిలి అక్కడికక్కడే మృతిచెందింది. ఊహించని ఈ పరిణామంతో కంగుతిన్న జైనుల్లా కొద్దిసేపటికి తేరుకుని విగతజీవిగా పడి ఉన్న భార్యను చూసి కన్నీటి పర్యంతమయ్యాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. శుక్రవారం జైనుల్లా ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ ఎస్సై బలరామిరెడ్డి కేసు నమోదు చేశారు. మృతదేహానికి ప్రభుత్వ వైద్యులు శవపరీక్ష నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

కావలి: కావలి పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ముఠాను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి గంజాయితోపాటు రెండు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కావలి డీఎస్పీ పి.శ్రీధర్ స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణంలోని పెద్దపవని రోడ్డులో ఉన్న విక్రమ సింహపురి పీజీ కళాశాల వద్ద నివసించే షేక్ మస్తానమ్మ, షేక్ గౌస్ బాషా, వైకుంఠపురానికి చెందిన షేక్ మీరాబీ, లింగసముద్రం మండలం అన్నెబోయినపల్లికి చెందిన దగ్గు చిన్న అబ్బయ్య, ప్రకాశం జిల్లా అత్తయింటివారిపాళెం ఉరఫ్ నేకునాంపురం గ్రామానికి చెందిన కారంశెట్టి సుధాకర్, పొన్నలూరు మండలం మాలెపాడు గ్రామానికి చెందిన షేక్ గౌస్‌బాషా, షేక్ రసూల్‌బీ, తూర్పుగోదావరి జిల్లా దారకొండ గ్రామానికి చెందిన మరో వ్యక్తి ముఠాగా ఏర్పడి గంజాయి అమ్మకాలు చేస్తున్నారు. విక్రమ సింహపురి పీజీ కళాశాల వద్ద నలుగురిని అరెస్ట్ చేసి 1.180 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే వైకుంఠపురం రైల్వే బ్రిడ్జి వద్ద ముగ్గురిని పట్టుకుని 1.350 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరందరినీ రిమాండ్‌కు తరలించారు. గంజాయి సరఫరా చేసే దారకొండకు చెందిన వ్యక్తిని అరెస్ట్ చేయాల్సి ఉందని డీఎస్పీ వెల్లడించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీధర్

గౌరవరం టోల్‌ప్లాజా వద్ద..

కావలి మండలం గౌరవరం గ్రామం టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం కావలి రూరల్ పోలీసులు పది కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వైజాగ్ నుంచి బెంగళూరుకు లారీలో గంజాయిని తీసుకెళ్తున్న వేలు అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

నేడు జెడ్పీలో సమావేశం

నెల్లూరు(పొగతోట): జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (డీడీసీఎంసీ) – దిశ (డీఐఎస్‌హెచ్‌ఏ) కమిటీ సమావేశం శనివారం జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని జెడ్పీ సీఈఓ విద్యారమ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్, ఎన్ఆర్ఎల్ఎం, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన, జాతీయ సామాజిక సహాయక పథకం, ప్రధానమంత్రి ఆవాజ్ యోజన, స్వచ్ఛభారత్ మిషన్, జల్‌జీవన్ మిషన్, స్మార్ట్ సిటీ మిషన్, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, జాతీయ ఆరోగ్య మిషన్, సమగ్ర శిక్ష అభియాన్, సమీకృత శిశు అభివృద్ధి, మధ్యాహ్న భోజన పథకం తదితర అంశాలపై సమావేశంలో చర్చిస్తామన్నారు. సమావేశానికి సభ్యులు, జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

క్లుప్తంగా

లైంగికదాడి కేసులో నలుగురికి పదేళ్ల జైలు

నెల్లూరు(లీగల్): ప్రేమ పేరుతో బాలికను నమ్మించి కిడ్నాప్ చేసి లైంగికదాడికి పాల్పడిన కేసులో నేరం రుజువు కావడంతో తిరుపతి జిల్లా ఓజిలి మండలం ఇనుగుంట గ్రామానికి చెందిన దండోలు సుబ్బారావు, అతడికి సహకరించిన కొగిలి సుబ్రహ్మణ్యం, యల్లంటి వెంకటయ్య, మంగుకూరు వాణిలకు శిక్ష పడింది. పదేళ్ల జైలు శిక్ష, రూ.22 వేలు జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సిరిపిరెడ్డి సుమ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. బాలిక బాలాయపల్లిలోని స్కూల్లో పదో తరగతి చదివేది. సుబ్బారావు జయంపు గ్రామంలో ఫర్టిలైజర్స్ దుకాణంలో పనిచేసేవాడు. అతను బాలికతో పరిచయం చేసుకుని ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. పైనిందితుల సహాయంతో 2015 సంవత్సరంలో బాలికను కిడ్నాప్ చేసి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధిత తండ్రి ఫిర్యాదు మేరకు బాలాయపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం నిందితులపై చార్జ్‌షీటు దాఖలు చేశారు. విచారణలో నిందితులపై నేరం రుజువు కావడంతో పైమేరకు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున కాకుటూరు రమేష్‌రెడ్డి వాదించారు.

అవి ఆవుల అవశేషాలే..

ఉదయగిరి: ఉదయగిరి దుర్గం అడవుల్లో కనిపించిన మూగజీవాల కళేబరాల అవశేషాలు ఆవులకు సంబంధించినవని రేంజ్ అధికారి డీఎస్ కుమార్‌రాజా శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ వన్యప్రాణుల అవశేషాలని ప్రచారం జరిగిందని, కానీ అందులో వాస్తవం లేదన్నారు. కుర్రపల్లి పశువైద్యాధికారి వినయ్ పరీక్షలు నిర్వహించి ఆవు అవశేషాలుగా నిర్ధారించినట్లు తెలిపారు. అడవుల్లో వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కండలేరులో 56.744 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 56.744 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరద కాలువ ద్వారా 600 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. సోమశిల జలాశయం నుంచి 1,100 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగకాలువకు 830, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 160, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

‘ఉపాధి’లో మస్టర్ల మాయ

- కలువాయి మండలంలో రూ.58 లక్షలకుపైగా స్వాహా
- ఊర్లో లేని వారి పేర్లు రాసి డబ్బులు నొక్కిన వైనం
- ఆరుగురు ఉపాధి సిబ్బందిపై క్రిమినల్ కేసులకు సిఫార్సు

కలువాయి: మండలంలో ఆరుగురు ఉపాధి సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎంపీడీఓ డీవీ నరసింహారావు శుక్రవారం స్థానిక పోలీసులను కోరారు. చినగోపవరం ఎఫ్ఏ మహేంద్రరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ పీ.బాబు రాజేష్, సాంకేతిక సహాయకులు ఆర్.ప్రసన్న, ఎంవీ.ప్రసాద్, వెంకటేశ్వర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ జె.శీనయ్యపై ఫిర్యాదు చేశారు. 2022 – 23లో జరిగిన ఉపాధి పనుల్లో రూ.58 లక్షలకు పైగా అవినీతి జరిగినట్లు 16వ విడత సామాజిక తనిఖీల్లో వెలుగులోకి రావడం, అనంతరం విచారణలో అది నిజమని తేలడంతో వారిపై క్రిమినల్ కేసులు నమోదుకు ఉన్నతాధికారులు సిఫార్సు చేశారు. వారిపై పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు ఫైల్ చేసి, ఎఫ్ఐఆర్ కాపీని తమకు పంపాలని డ్వామా నెల్లూరు జిల్లా కార్యాలయం నుంచి ఉన్నతాధికారులు పంపిన ఆదేశాలు శుక్రవారం తనకు అందినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు. ఈ మేరకు కలువాయి పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు.



వివరాలు తెలియజేస్తున్న ఎంపీడీఓ నరసింహారావు

భారీగా అవినీతి


మండలంలో ఒక్క చినగోపవరం పంచాయతీలోనే సుమారు రూ.58 లక్షలకు పైగా అవినీతి జరిగినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. దీనిపై రాష్ట్ర విజిలెన్స్ అధికారి భవానీ హర్ష విచారణ జరిపారు. గ్రామంలో లేని 148 మందిని మస్టర్లలో ఎక్కించి వారి పేరున బిల్లులు చెల్లించి ఎఫ్ఏ మహేంద్ర, కంప్యూటర్ ఆపరేటర్ అకౌంట్స్ అసిస్టెంట్ పి.బాబు రాజేష్ రూ.25.5 లక్షలు అవినీతికి పాల్పడినట్లు బయటపడింది. వారు ఎవరూ ఆ గ్రామానికి చెందిన వారు కాకపోవడం, పలు రాష్ట్రాల్లో ఉన్న వారి అకౌంట్లకు నగదు జమైనట్లు తేలింది. అంతేగాక అదే కాలంలో ఇక్కడ టీఏలుగా పనిచేసిన ఆర్.ప్రసన్న, ఎంవీ ప్రసాద్, ఎం.వెంకటేశ్వర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ జె.శీనయ్య మరో రూ.32.87 లక్షల మేర నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని తేల్చారు. ఈ మేరకు ఆయన ఉన్నతాధికారులకు నివేదికను అందజేయడంతో వారిపై క్రిమినల్ కేసులు నమోదుకు ఆదేశాలు జారీ అయ్యాయి.

అంబుడ్స్‌మెన్ పాత్ర కీలకం

చినగోపవరం ఉపాధి పనుల్లో జరిగిన అవినీతిని వెలుగులోకి తేవడంలో అంబుడ్స్‌మన్ వెంకటరెడ్డి కీలకపాత్ర పోషించారు. గ్రామంలో జరిగిన ప్రతి పనిపైనా నిఘా పెట్టారు. జాబ్‌కార్డులు, మస్టర్లు, బ్యాంక్ అకౌంట్లు లోతుగా పరిశీలించడంతోపాటు గ్రామ ఉపాధి కూలీలతో మమేకమై ఇక్కడ జరిగిన అవినీతిని వెలుగులోకి తెచ్చారు. ఈ విషయాన్ని అంతటితో వదలకుండా 16వ విడత సామాజిక తనిఖీ హియరింగ్‌కు సోషల్ ఆడిట్ డైరెక్టర్ వచ్చేలా చేశారు. అనంతరం విజిలెన్స్ అధికారుల విచారణకు పూర్తి సహాయ సహకారాలు అందించి అవినీతికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసుల నమోదులో కీలకపాత్ర పోషించారు.

పెంచలకోనలో గోదాదేవికి క్షేత్రోత్సవం

రాపూరు: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో గోదాదేవికి నాలుగు శుక్రవారాలపాటు ప్రత్యేక పూజలు, క్షేత్రోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా మొదటి శుక్రవారం ఉత్సవ విగ్రహన్ని తిరుచ్చిపై కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించి కోన మాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. తెల్లవారుజామున పెనుశిల లక్ష్మీనరసింహస్వామికి తిరుప్పావై, ప్రత్యేక పూజలు చేశారు. ఉభయకర్తలుగా మధుస్వామి, సువర్ణలక్ష్మి వ్యవహరించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



క్షేత్రోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

పునాది బలంగా ఉంటేనే అద్భుత ఫలితాలు


- ఎస్సీఈఆర్టీ పరిశీలకురాలు మాధవి

నెల్లూరు(టౌన్): విద్యార్థులకు పునాది బలంగా ఉంటేనే భవిష్యత్‌లో అద్భుత ఫలితాలు సాధిస్తారని ఎస్సీఈఆర్టీ పరిశీలకురాలు మాధవి తెలిపారు. వెంకటాచలం మండలం గొలగమూడిలో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్‌లో జరుగుతున్న ఎఫ్ఎస్ఎల్ శిక్షణను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1, 2 తరగతుల్లో భాష, గణిత పరంగా బలంగా ఉండాలన్నారు. శిక్షణలో అందిస్తున్న సూచనలను ఉపాధ్యాయులు వారి పాఠశాలల్లో అమలు చేయాలన్నారు. గుణాత్మక విద్యను అందించడం, సమయ విలువ, పాలన గురించి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎంఓ సుధీర్ బాబు, ఆర్పీలు పాల్గొన్నారు.



శిక్షణ గురించి ఆరా తీస్తున్న మాధవి

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.24
సన్నవి : రూ.18
పండ్లు : రూ.10

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 100
లేయర్ (లైవ్)	: 100
బ్రాయిలర్ చికెన్	: 186
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 206
లేయర్ చికెన్	: 170